క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గట్టు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బొగ్గుల కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రామునాయుడు, బజారి, తిమ్మప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరం



గద్వాల రూరల్: పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంగా మారిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన అందజేశారు. పేదలు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, భాస్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్డి సేవా సమితి సమావేశం



గద్వాల అర్బన్: ఈ నెల 2న ఆదివారం రెడ్డి సేవా సమితి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తునట్లు ఆ సమితి ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి బాలికల వసతిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేసి వసతితో పాటు ఉత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. 2వ తేదీ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమీపంలోని అక్షయ బంకెట్ హాల్‌లో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నూతన కమిటీతో పాటు మహిళ విభాగం కమిటీని ఎన్నుకుంటామన్నారు. రెడ్డి కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ సమితి కోశాధికారి కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రమణారావు

అలంపూర్: మానవపాడు ఎంపీడీఓ రమణారావుకు అలంపూర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రమణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ నాగశేషాద్రి సూరి సెలవుపై వెళ్లారు.

నేటి నుంచి ప్రో వాలీబాల్ ప్రీమియం లీగ్

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ప్రో వాలీబాల్ ప్రీమియం లీగ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో శనివారం నుంచి బుధవారం వరకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు ఉంటుదని తెలిపారు. వివరాలకు 9985337551, 8074435670 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా శ్రీరాముడికి పట్టాభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో మూడు రోజుల నుంచి శ్రీరామ నవమి వేడుకులు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారికి పట్టాభిషేకంలో శుక్రవారం సీతారాముల విగ్రహాలను మండల కేంద్రంలో ఊరేగించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన, కోలాటాలతో అలరించారు. కార్యక్రమంలో అర్చకులు రంగనాథాచార్యులు, నరసింహాచార్యులు, బాలాజీ, వంశీకృష్ణాచార్యులు, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

అయిజ: పట్టణంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం క్యాంపు కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



కలుకుంట్లలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మానవపాడు: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని సద్గురు అవధూత రంగలింగేశ్వర స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని కలుకుంట్లలో గురుదత్త క్షేత్రంలో సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. సేవాదృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఆలయంలో ప్రతి రోజు హోమం నిర్వహిస్తామన్నారు. సరస్వతి విగ్రహ ఏర్పాటు సందర్భంగా క్షేత్రం రెండువేల మంది మహిళలకు చీర, వడిబియ్యంను కానుకగా అందజేశారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మలింగారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



అమరవాయిలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి

మల్దకల్: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మొత్తం పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ మండల నాయకుడు శేషంపల్లి నర్సింహులు తన స్వంత ఖర్చులతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను సమకూర్చారు. ఈ సందర్భంగా మండలంలోని అమరవాయిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ కొండారెడ్డి ఆయా పాఠశాలకు చెందిన 450 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జానకమ్మ, విజయప్రభ, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గోవర్ధన్‌గౌడ్, గీత, శ్రీలత, రవి, ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష పాటిస్తే చర్యలు



మల్దకల్: ఎవరైనా కుల వివక్ష పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నేతువానిపల్లిలో సర్పంచ్ వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రెండు గ్లాసుల పద్ధతి అవలంభించడం, కులవివక్ష పాటించడం నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికి జాబ్‌కార్డులు

మల్దకల్: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులు అందజేస్తామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని దీంతో కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా హరితహారంలో నాటిన మొక్కలకు నీరందించాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీలలో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొన్న బైక్

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్‌పై ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ నుంచి బాల్‌నగర్‌కు వెళ్తున్న బ్యాటరీ పౌడర్‌లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై నిలిచింది. జల్లాపురం గ్రామానికి చెందిన పరుశురాముడు ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు లారీని ఢీ కొన్నాడు. బైక్‌పై ఉన్న పరుశరాముడికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని నేషనల్ హైవే సిబ్బంది హైవే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



ధన్వాడలోని ఉప్పేరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈఓ శివ ప్రసాద్ హాజరై సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలంకరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో సెల్ఫీలు దిగి కన్నీటిపర్యంతం అయ్యారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తక్కశిల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 5 వ తరగతి విద్యార్థులకు 4 వ తరగతి విద్యార్థులు వీడ్కోలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, సుందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సూర్యకుమార్, భరత్ కుమార్, రాజగోపాల్ రెడ్డి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు ఉప్పేరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, లక్ష్మణ్, రమేష్‌బాబు, మద్దిలేటి, రమేష్‌గుప్త, శ్రీధర్ పాల్గొన్నారు.



మానవపాడు జెడ్పీహెచ్ఎస్‌లో..



తక్కశిలలో ..

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళ సంఘాల సభ్యులు, ఆర్‌పీలు, మున్సిపల్ అధికారులు

అలంపూర్ రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్పీలు ధనుంజయ, రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహిళ సంఘాల ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా పట్టణ లెవల్ ఫెడరేషన్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానికులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలరాజు, రాణి, సుంకన్న, అలివేలు, లత, ఏ.రాణి, మనీషా, రాజేశ్వరి, మున్సిపల్ అధికారులు, మహిళ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ తిక్కన్న

కేటీదొడ్డి: మండలంలోని సోంపురంలో శ్రీరామ నవమి సందర్భంగా బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్పంచ్ తిక్కన్న హాజరై పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి ఆంజనేయులు రూ. 3016, రెండో బహుమతి భీమన్న రూ.2016, మూడో బహుమతి ఉరుకుంద రూ.1016 అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ

అమరచింత: ఆత్మకూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బందికి పట్టణానికి చెందిన గాండ్ల శివకుమార్ తన కుమార్తె సాత్విక పుట్టిన రోజు సందర్భంగా శానిటేషన్ కిట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈమేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ వార్డుల పరిశుభ్రతలో ముందుడి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇలాంటివి అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బీఎన్‌కే రమేష్, రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ మల్లేష్ భార్య సరోజకు శుక్రవారం జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచు హనుమంతు నాయుడులు రైతుబీమా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఇటీవల కుర్వ మల్లేష్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో రైతుబీమా రూ.5లక్షలు మంజూరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని బల్గెరలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మృతిచెందిన మల్లేష్ సతీమణికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, చమన్‌ఖాన్‌దొడ్డి సర్పంచు గోవిందమ్మ, నాయకులు నాగరాజు, కిష్టప్ప, బజారి, బుగ్గన్న, తిమ్మప్ప, నర్సింహులు, యేసు, నాగప్ప, రాముడు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అయిజ: పట్టణ సమీపంలోని రాయచూర్ రోడ్డుపై డీసీఎం ట్రక్కు బోల్తాపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని కర్నూలుకు డీసీఎంలో గొర్రెలను తరలిస్తున్నారు. అయిజ సమీపంలో రాయచూరు–కర్నూలు రోడ్డుపై ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. డీసీఎం ట్రక్కు డ్రైవర్ సురేష్ చాకచక్యంగా ప్రాణాపాయం తప్పింది.

పాత కక్షలతో ఇరువర్గాల దాడి

ధరూరు: పాత కక్షలతో ఇరువర్గాల వారు దాడి చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని నీలహళ్లి గ్రామానికి చెందిన రామన్‌గౌడ్‌కు అదే గ్రామానికి చెందిన గోవింద్ మద్యం తాపి దాడి చేసి గాయపరిచాడు. బాధితుడిని కుటుంబసభ్యులు గద్వాల ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇరువురి మధ్య మూడేళ్ల నుంచి పొలం తగాదాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రేవులపల్లి పోలీసులు తెలిపారు.

అంతరాష్ట్ర భజన పోటీల్లో ప్రతిభ

పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడులో నిర్వహించిన అంతరాష్ట్ర భజన పోటీలను గురువారం సాయంత్రం 4 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో పాన్‌గల్ మండలంలోని రాయినిపల్లి మొదటి బహుమతి రూ. 25 వేలు, అనంతపురం జిల్లా శంకరాపురం రెండో బహుమతిగా రూ. 20 వేలు, గద్వాల జిల్లా ఐజ మండలం పర్దీపురం మూడో బహుమతి రూ. 15వేలు, గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని నక్కలపల్లి నాలుగో బహుమతిగా రూ. 12 వేలు, అనంతపురం జిల్లా కూచువారిపల్లి ఐదో బహుమతిగా రూ. 10 వేలు గెలుచుకున్నారు. వీరికి సర్పంచ్ గోవిందు నాయుడు, సత్యం, అశోక్ బ్రదర్స్, రాజు అగ్రో కెమికల్స్, శివకుమార్ శివ అగ్రో కెమికల్స్, రాధాకృష్ణ నాయుడులు నగదు ప్రదానం చేశారు.

చిరుధాన్యాలపై అవగాహన



పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీఓ సుజాత

మానవపాడు: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చిరుధాన్యాలపై గర్భిణులకు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిరుధాన్యాలు ఆహారంలో ప్రతి రోజు తీసుకోవాలన్నారు. జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆస్మా, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలని రైతు వేదిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు ధాన్యాల్లో అనేక పోషకాలుంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. రైతు వేదికలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. అన్నప్రాసన, వెల్‌బేబీ షోను నిర్వహించారు. ఆరోగ్యంగా ఉన్న అంగన్‌వాడీ పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, సీహెచ్‌ఓ ఊసేని, ఎంఎల్‌హెచ్‌పీ శివకుమార్, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారినే ఎన్నుకుందాం



రంగాపురం కూలీలతో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

కేటీదొడ్డి: ప్రజా సమస్యలపై ప్రశ్నించేవారినే ఎన్నుకుందామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైలగడ్డ నుంచి రంగాపురం వరకు నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాల కుటుంబ పాలనలో నడిగడ్డ ప్రాంతానికి చేసిందేమీలేదని విమర్శించారు. అనంతరం రంగాపురం గ్రామ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, రంగస్వామి, పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో భాగంగా గురువారం రాత్రి అల్వలపాడులో బస చేసి శుక్రవారం కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మైలగడ్డ గ్రామం మీదుగా కేటీదొడ్డి మండలంలోని గ్రామాలకు పాదయాత్రగా తరలివెళ్లారు.

గట్టు: మండలంలోని బస్వాపురం, తుమ్మలచెరువు, నల్లగట్టు, వాయిల్‌కుంట తండాలు, ఆలూరు వరకు ఆత్మగౌరవ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబ పాలనకు స్వస్తి పలుకుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో భూముల కబ్జా

రాజోళి: బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు, పేదల భూములు కబ్జాకు గురవుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలో ముండ్లదిన్నె, పెద్ద తాండ్రపాడు, తుమ్మిళ్ల, పడమటి గార్లపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న భూములను ప్రభుత్వం వేలం వేస్తే, గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కబ్జాలకు సాక్ష్యం ముండ్లదిన్నె గ్రామమని, ఇక్కడ యథేచ్ఛగా భూములు అమ్ముతున్నారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు కష్టపడి చదివితే ప్రశ్నాపత్రాలను అమ్ముకుని యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రవి, కేశవరావ్, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మైదానం ఏర్పాటు చేయండి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బొకే అందజేస్తున్న వడ్డేపల్లి నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మాధవస్వామి గట్టు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో క్రికెట్ మైదానం ఏర్పాటు చేయాలని శుక్రవారం క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, భార్గవ్‌యాదవ్‌లు కోరారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో వారు మంత్రిని కలిశారు. సానుకూలంగా మంత్రి స్పందించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిసి వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఇంటి పన్నులు, దుకాణాల పన్నులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని విన్నవించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి



ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అలంపూర్: మండలంలోని లింగనవాయి గ్రామస్తులు శుక్రవారం విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌ను శుక్రవారం కలిశారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఈదురు గాలుల కారణంగా విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. గతంలో అధికారులు ఒక స్తంభాన్ని గ్రామానికి తీసుకొచ్చారని దీనికి అవసరమైన పరికరాలు, వస్తువులు ఇవ్వలేదని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి ఈదన్న, కాలనీవాసులు ఉన్నారు.

పదో తరగతి కీలకం



మాట్లాడుతున్న జీహెచ్‌ఎం నరేష్

ధరూరు: విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలమని రేవులపల్లి ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం నరేష్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని విద్యార్థులకు తగిన నిద్ర, ఒత్తిడి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కరాటేతో ఆత్మరక్షణ ఉంటుందని జీహెచ్‌ఎం నరేష్ అన్నారు. శుక్రవారం బాలికలకు రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా కరాటే ఇన్‌స్పెక్టర్ రషీద్ ఆధ్వర్యంలో మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు 30 రోజుల పాటు కరాటే శిక్షణ ఇచ్చారు. నేర్చుకున్న అంశాలను పాఠశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్

మానవపాడు: రంజాన్ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని జామియా మసీదులో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందును నబీసాబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. సర్వమత సారం ఒకటేనని, మనుషులంతా సోదరభావంతో మెలగాలని సూచించారు. ఉపవాస దీక్షలతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి ఒక్కరూ నమాజ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముతవల్లి మహబూబ్, మాందబాషా, మదర్‌ఆర్షద్‌లు, బాషా పాల్గొన్నారు.